పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్

- ఎట్టకేలకు ఖాయంచేసిన కాంగ్రెస్ అధిష్ఠానం
- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి ఎమ్మెల్సీ
- గతంలో గిడ్డంగుల చైర్మన్‌గా బాధ్యతలు

కుటుంబ నేపథ్యం

పేరు: బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
పుట్టిన తేదీ: 1966 ఫిబ్రవరి 24
భార్య: సంధ్యారాణి
సంతానం: ఇద్దరు కొడుకులు (రుత్విక్‌గౌడ్, ప్రణవ్‌గౌడ్)
స్వస్థలం: రహత్‌నగర్, భీమ్‌గల్ మండలం, నిజామాబాద్ జిల్లా

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ)/నిజామాబాద్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఢిల్లీలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఇంత కాలం సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన పదవీకాలం గత జూలైలోనే ముగిసింది. కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు నెలలుగా పార్టీ నేతలతో చర్చలు జరిపింది. పీసీసీ అధ్యక్ష పీఠం కోసం మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎంపీ బలరాంనాయక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా పోటీ పడినప్పటికీ అధిష్ఠానం మహేశ్‌కుమార్‌గౌడ్‌కే బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడాలకు ప్రాతినిథ్యం లేకపోవడంతో, పీసీసీ అధ్యక్ష పదవినైనా ఇస్తారని ఆ వర్గం నేతలు భావించారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ తనకు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని కోరారు. మాదిగలకు సైతం మంత్రివర్గంలో సరైన ప్రాధాన్యం దక్కకపోవడంతో పీసీసీ పీఠం కోసం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పోటీపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అండదండలు ఉండటంతో మహేశ్‌కుమార్‌గౌడ్ వైపే అధిష్ఠానం మొగ్గుచూపింది.

విద్యార్థి దశలోనే కాంగ్రెస్‌లోకి..

విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్.. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1986లో జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2013-14లో ఉమ్మడి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా వ్యవహరించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014లో టీపీసీసీ కార్యదర్శిగా, 2021లో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2024లో తొలిసారిగా శాసనమండలికి ఎమ్మెల్యే కోటాలో ఎన్నికయ్యారు. 1994లో డిచ్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, 2014లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. గత డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మహేశ్‌కుమార్ గౌడ్‌కు క్యాబినెట్‌లో స్థానం లభిస్తుందని అప్పట్లో ఊహించారు. కానీ, అప్పటికి ఆయన ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా లేకపోవడంతో అవకాశం చేజారిందని భావిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలోనే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికై చట్టసభలోకి ప్రవేశించారు.

సచివాలయ డోమ్‌లు కూలగొడతాం: బండి

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సచివాలయంలో కూల్చివేతలు ఉంటాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ బేగంపేటలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే సచివాలయంలో డోమ్‌లను కూల్చేస్తామని గతంలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. వరదలకు సంబంధించి నిబంధనల ప్రకారం సాయం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నదని చెప్పారు.

జిట్టా పార్థివదేహానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చుతున్న హరీశ్‌రావు. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి

ఉద్యమనేత 'జిట్టా' కన్నుమూత

- అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత బాలకృష్ణారెడ్డి మృతి
- కొంత కాలంగా బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో ఐసీయూలో చికిత్స
- భువనగిరిలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- జిట్టా మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి
- పలువురు ప్రముఖుల నివాళి

టీఆర్ఎస్‌లో చేరిక సమయంలో కేసీఆర్‌కు గొర్రెపిల్లను అందిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి

హైదరాబాద్/యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. నెలన్నరగా మృత్యువుతో పోరాడి శుక్రవారం ఉదయం 11.47గంటలకు తుదిశ్వాస విడిచారు. బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో గత నెలన్నరగా సికింద్రాబాద్‌లోని యశోదా దవాఖానలో చికిత్స తీసుకుంటున్నారు. జిట్టా మరణవార్తతో భువనగిరి శోకసంద్రంలో మునిగిపోయింది. జిట్టా పార్థివదేహాన్ని భువనగిరిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నేత, జిట్టా బాలకృష్ణారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపాన్ని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన పోరాటంలో జిట్టా బాలకృష్ణారెడ్డి క్రియాశీలకంగా పాల్గొన్నారని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. వారి మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిట్టా ప్రస్థానం ఇలా..

జిట్టా 1972 డిసెంబర్ 14న జిట్టా బాల్‌రెడ్డి (రిటైర్డ్ టీచర్), రాధమ్మ దంపతులకు జన్మించారు. సొంతూరు భువనగిరి పట్టణ పరిధిలోని బొమ్మాయిపల్లి. ఆయనకు భార్య సునీత, కుమారుడు వివేకానందరెడ్డి, కూతురు ఝాన్సీ ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో యువజన సంఘాలను ఏకం చేయడంలో జిట్టా కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమంలో మంచి పేరు తెచ్చుకున్న జిట్టాకు రాజకీయంగా కలిసిరాలేదు. భువనగిరి ఎమ్మెల్యేగా పలు దఫాలుగా పోటీ చేసినా అదృష్టం కలిసిరాలేదు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో పని చేశారు. వివిధ పరిణామాల నేపథ్యంలో సొంతంగా యువ తెలంగాణ పార్టీ స్థాపించారు. ఆ తర్వాత పార్టీని బీజేపీలో విలీనం చేశారు. అటు నుంచి కాంగ్రెస్, తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన తల్లి రాధమ్మ పేరున కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.106 గ్రామాల్లో వాటర్ ఫిల్టరు ఏర్పాటుచేయించారు. తెలంగాణ జాతర, ధూంధాం కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. భువనగిరిలో జూనియర్ కాలేజీ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేశారు.

అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు

ప్రజానేతకు భువనగిరి జనం అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జిట్టా పాడెను మోశారు. జిట్టా బాలకృష్ణారెడ్డి అంత్యక్రియలు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు డిమాండ్ చేశారు. పార్థివ దేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకునేందుకు యత్నించారు.

అనేక పోరాటాల్లో కలిసి పనిచేశాం: మాజీ మంత్రి టీ హరీశ్‌రావు

జిట్టా మృతిపై మాజీ మంత్రి టీ హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను కలచివేసిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన అనేక పోరాటాల్లో కలిసి పనిచేశామని, భువనగిరి ప్రాంత ప్రజల కోసం జిట్టా ఎంతో తపనపడ్డారని గుర్తుచేశారు.

జిట్టా మృతిపై కేటీఆర్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జిట్టా బాలకృష్ణారెడ్డి మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. జిట్టా బాలకృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కేటీఆర్ ప్రార్థించారు. జిట్టా కోలుకుంటారని భావించానని కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించి మొదటి నుంచి కేసీఆర్ వెంట నడిచిన వ్యక్తుల్లో జిట్టా ఒకరని గుర్తు చేసుకున్నారు.

బర్త్ సర్టిఫికెట్ లేక ఆగిన గుండె ఆపరేషన్

ఇబ్బందుల్లో పసి ప్రాణం

ములుగు, సెప్టెంబర్ 6 (నమస్తేతెలంగాణ): జనన ధ్రువీకరణ పత్రం లేక చిన్నారి గుండె ఆపరేషన్ ఆగింది. సదరు సర్టిఫికెట్ కోసం చిన్నారి తండ్రి పక్షం రోజులుగా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. బాధితుడు అజ్మీరా సురేశ్ తెలిపిన వివరాల ప్రకా రం.. ములుగు ప్రభుత్వ దవాఖానలో ఏప్రిల్ 27న సురేశ్ భార్య సుజాత బా బుకు జన్మనిచ్చింది. బాబు ఇటీవల అనారోగ్యానికి గురికాగా, వైద్యులకు చూపిస్తే బాబు గుండెకు రంధ్రం పడిందని ఆపరేషన్ చేయాలని చెప్పారు. రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పగా హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించేందుకు తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు జనన ధ్రువీకరణ పత్రం కావాలని అడిగారు. దీంతో గతనెల 27నుంచి సురేశ్ ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు అందించలేదు. ఈ పత్రం ఉంటేనే వైద్యులు ఆపరేషన్ నిర్వహించే అవకాశం ఉన్నది.

అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: కొణతం దిలీప్

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పోలీసులు తన ఇంట్లోకి అడుగుపెట్టిన మరుక్షణం నుంచి అర్ధరాత్రి మళ్లీ ఇంటివద్ద వాళ్లే వదిలిపెట్టే వరకూ అనుక్షణం అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ సోమాభరత్, గంద్ర మోహన్ రావు, రాజేశ్వర్‌రావు, కల్యాణ్‌రావు, లలితారెడ్డి, జక్కుల లక్ష్మణ్, వేణుగోపాల్‌రావు, కార్తీక్, నిరంజన్‌రెడ్డితోపాటు న్యాయవాదులు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. అక్రమ కేసు పెట్టి తనను జైలుకు పంపాలనే ప్రభుత్వ పన్నాగం పారలేదని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రికార్డుస్థాయిలో మక్క ధరలు

క్వింటాకు రూ.3,015

కాజీపుగ్గ, సెప్టెంబర్ 6: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,090 ఉండగా, నెల రోజులుగా క్రమంగా పెరుగుతున్నది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా శుక్రవారం క్వింటాకు రూ.3,015 ధర పలికినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

మళ్లీ పెరిగిన ఉల్లి ధరలు

వారంలోనే రూ.10 పెరుగుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఉల్లి ధరలు మళ్లీ పెరిగాయి. వారం రోజుల్లోనే కిలో రూ.10 పెరిగింది. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉల్లి ధరల ప్రభావం పడకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులో భాగంగా పెరుగుతున్న ఉల్లి ధరలను నియంత్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలే ఉల్లి ధరల పెరుగుదలకు కారణంగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. పోరుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మార్కెట్‌లోకి ఉల్లి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.40 నుంచి రూ.45, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70కి చేరింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు భయపడుతున్నారు.

కేంద్ర సాయుధ దళాల్లో 39,481పోస్టులు

పదో తరగతి ఉత్తీర్ణులకు అవకాశం

ఎడ్యుకేషన్ డెస్క్, నమస్తే తెలంగాణ : కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/రైఫిల్ మ్యాన్(గ్రౌండ్ డ్యూటీ)పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ)నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 39,481 ఖాళీలు ఉన్నాయి. వీటిలో పురుషులకు 35,612, మహిళలకు 3,869పోస్టులన కేటాయించారు. బీఎస్ఎఫ్-15,654, సీఐఎస్ఎఫ్-7,145, సీఆర్‌పీఎఫ్-11,541, ఎస్ఎస్‌బీ-819, ఐటీబీపీ-3,017, అస్సాం రైఫిల్స్-1,248, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్-35, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో-22ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై పురుషులు 170, మహిళలు 157సెం.మీటర్ల ఎత్తు ఉండాలి. 2025, జనవరి 1 నాటికి 18-23ఏండ్ల మధ్య ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అక్టోబర్ 14 గడువు. పూర్తి వివరాలకు https:// ssc.gov.inవెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

ఆసిఫాబాద్ డీఎస్పీపై బదిలీ వేటు

పోలీసు పహారాలోనే జైనూర్ ఏజెన్సీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల ఆదివాసీ మహిళపై దాడి, ఆ తరువాత చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో ఆసిఫాబాద్ డీఎస్పీ పంతాటి సదయ్యపై బదిలీ వేటు పడింది. ఆయన్ను కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేయగా, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న 144 సెక్షన్

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : జైనూర్‌లో పోలీసులు పటిష్ఠ భద్రత కొనసాగుతున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతోపాటు అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్, సిరిసిల్ల, జగిత్యాల, ఆదిలాబాద్ ఎస్పీలు అఖిల్ మహాజన్, అశోక్‌కుమార్, గౌస్ ఆలం, బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ రెండు రోజులుగా అక్కడే ఉంటూ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. 144 సెక్షన్ శుక్రవారం కొనసాగింది. ఆఫర్ ఉంటే తప్ప జైనూర్‌లోకి ఎవరినీ అనుమతించడం లేదు. శుక్రవారం నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రారంభంకానుండగా, పోలీసులు మరింత బందోబస్తు పెంచే అవకాశమున్నది. జిల్లావ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు.

మూడు కమిషన్లకు చైర్మన్ల నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మూడు కమిషన్లకు చైర్మన్లను నియమించింది. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ఎం కోదండరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని నియమించింది. వీరి పదవీకాలం రెండేండ్లు ఉంటుంది. బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్, సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి నియమితులయ్యారు. దీనికి బీసీ వెల్ఫేర్ కమిషనర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి శుక్రవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు.

9 నెలలు.. 1,900 లైంగికదాడులు

- సర్కార్ ఫెయిల్.. గాడితప్పిన శాంతిభద్రతలు
- మహిళల రక్షణ విషయంలో మొద్దునిద్ర
- బీఆర్ఎస్ హయాంలో సేఫెస్ట్ బెస్ట్ స్టేట్‌గా గుర్తింపు:హరీశ్
- పోలీసులను ప్రభుత్వం పని చేయనివ్వడం లేదని విమర్శ
- జైనూరు బాధిత మహిళకు గాంధీ దవాఖానలో పరామర్శ
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలి: సబిత, సునీత

గాంధీ దవాఖాన వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 6: గత తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో 1,900 లైంగికదాడి ఘటనలు, 2,600 హత్యలు జరిగాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 260 స్మగుల్డ్ మారణాయుధాలు లభించినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడమే లేదని చెప్పారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆటోడ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడి గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆదివాసీ మహిళను మాజీ మంత్రులైన సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారు. బాధిత మహిళ కుటుంబ సభ్యులతో వారు మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందిస్తున్న చికిత్స గురించి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిని అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతున్నదని, బీహార్ తరహాలో దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు అన్ని రంగాల్లో ఫెయిలైందని, శాంతి భద్రతలు గాడి తప్పాయని విమర్శించారు. గత కేసీఆర్ పాలనలో తెలంగాణను శాంతి భద్రతలకు సేఫెస్ట్ అండ్ బెస్ట్ స్టేట్‌గా మంచి పేరు వచ్చిందని గుర్తు చేశారు. నిరుపేద ఆదివాసీ మహిళపై పాశవికంగా దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. భూపాలపల్లిలో కానిస్టేబుల్‌పై ఎస్సై లైంగికదాడి, ఇటీవల నాగర్‌కర్నూల్‌లో జరిగిన సంఘటన వరకు అనేక ఘటనలు నిత్యం జరుగుతూ వస్తున్నా ప్రభుత్వం మొద్దునిద్ర పోతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలకులు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని, జైనూరు లాంటి ఘటనలతో రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారుతున్నదని ధ్వజమెత్తారు.

బాధితురాలికి 10 లక్షల పరిహారం ఇవ్వాలి

గిరిజన ఆడబిడ్డపై జరిగిన దారుణమైన దాడిని బీఆర్ఎస్ పార్టీ తరపున ఖండిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లికి పోయి పెద్ద పెద్ద మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి గాంధీ దవాఖానకు వచ్చి లైంగికదాడిలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళను పరామర్శించే సమయమే దొరకడం లేదా? అని ప్రశ్నించారు. హోం, గిరిజన శాఖ ఆయన వద్దే ఉన్నా ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రెండు నెలల్లోనే నాలుగు మతకలహాలు

కొత్త డీజీపీ వచ్చిన 2నెలల్లోనే రాష్ట్రంలో నాలుగు మత కలహాలు జరిగాయని, మెదక్‌లో సరిగాలేరన్న డీసీపీని తీసుకొచ్చి హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారని, రాష్ట్రంలో శాంతి భద్రతల వ్యవస్థ మొత్తం నాశనమైందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డయల్ 100 సరిగా పనిచేయడం లేదని, పోలీసులను ప్రభుత్వం పనిచేయనీయడం లేదని చెప్పారు. ఖమ్మంలో ఎన్‌కౌంటర్ జరిగి 10 మంది చనిపోయారని, గత దశాబ్దకాలంలో ఒక్క బుల్లెట్ శబ్దం కూడా లేదని, ఈ ప్రభుత్వ హయాంలో ఫేక్ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ జోక్యం చేసుకొని రాష్ట్రంలో రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను వేధించడం, ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, కండువాలు కప్పడంలో సీఎం బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వరద నిర్వహణ, సహాయం, రుణమాఫీ, విద్యావ్యవస్థను నడపడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. అంతకుముందు జైనూరు ఘటనపై బాధితురాలి కుమారుడు మాట్లాడారు. రాఖీ కట్టేందుకుతన తన తల్లి ఆటోలో వెళ్తుంటే అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఆటోడ్రైవర్ లైంగికదాడి చేయడానికి ప్రయత్నించాడని చెప్పారు. ఆ సమయంలో తన తల్లి ప్రతిఘటించడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు.

ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు: సునీతా లక్ష్మారెడ్డి

జైనూరు ఆదివాసీ మహిళపై జరిగిన దాడి లాంటి ఘటనలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని మహిళా కమిషన్ మాజీ చైర్మన్, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. జైనూరు బాధిత మహిళను చూస్తే హృదయం ద్రవించిందని, తీవ్రమైన గాయాలతో జీవచ్ఛవంలా పడి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఇలాంటి ఘటనలపై బీఆర్ఎస్ పార్టీ నేతలు వెళ్లాకే ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తున్నదని తెలిపారు. ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు రూ.10 లక్షల వరకు ఆర్థికసాయం అందజేయవచ్చని సూచించారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి: సబితా ఇంద్రారెడ్డి

జైనూరు ఘటనపై తక్షణ చర్యలకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమీక్షించేందుకు సీఎంకు సమయం లేదని ఎద్దేవా చేశారు. కనీసం బాధితులకు న్యాయంచేసే దిశగా నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచన కూడా లేదని, ఈ ప్రభుత్వానికి మహిళలంటే చులకన భావన ఉన్నదని విమర్శించారు. రాష్ట్రంలో అత్యాచారాలు జరుగుతున్న చోట ఎక్కడ కూడా బాధ్యులపై శిక్షలు పడుతున్న సందర్భాలు కనిపించట్లేదని తెలిపారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒకమూల ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉన్నదని, ముఖ్యమంత్రి ఇప్పటికైనా కండ్లు తెరిచి ఘటనలపై రివ్యూ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు హేమలత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాగుపామును నోట్లో పెట్టుకొని విన్యాసం చేస్తున్న శివరాజు

సాహసం చేయబోయి.. ప్రాణాలు కోల్పోయి

- నాగుపామును నోట్లో పెట్టుకున్న యువకుడు
- అరగంటలో ప్రాణాలు కోల్పోయిన వైనం

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 6: కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో విషాదం చోటుచేసుకున్నది. శివ అనే 21 ఏండ్ల యువకుడు పాముతో చెలగాటమాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. సరదాకు వీడియో తీసుకునే ప్రయత్నంలో ఏకంగా ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వచ్చింది. దేశాయిపేట్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం వద్దకు నాగుపాము వచ్చిందని గురువారం సాయంత్రం స్థానికులు సమాచారమిచ్చారు. అక్కడే నివసిస్తున్న శివరాజు హుటాహుటిన అక్కడకు చేరుకుని దాన్ని పట్టుకున్నాడు. అ